ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
శనివారం 15 జూన్ 2024



కట్టు కాలువ కబ్జాకు యత్నం
- అనుమతుల పేరిట కాలువలో నిర్మాణాలు - 8లో..

కార్మికులపై కక్ష సాధింపు
ధోరణి వీడాలి - 8లో..



వాడీవేడిగా జడ్పీ సమావేశం

- ఫ్లెక్సీ.. కార్యదర్శుల బదిలీలపై వివాదం
- ప్రజాప్రతినిధులను అగౌరవపర్చడమేనా?
- అభివృద్ధి పనులపైనా సమాచారం లేదు
- అభివృద్ధి అంశాలపై సాదాసీదాగా చర్చ

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

ఫ్లెక్సీ తొలగింపు, కార్యదర్శుల బదిలీలపై చర్చతో జడ్పీ సర్వ సభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. కార్యదర్శుల బదిలీపై అధికారులు ప్రజాప్రతినిధులను అవమానపర్చారని ఇల్లంతకుంట ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి ధ్వజమెత్తారు. దీంతో జడ్పీ సీఈవో, ఎంపీపీకి మధ్య తీవ్రమైన చర్చ జరిగింది. జడ్పీ సీఈవో, డీపీవోల వివరణలు, జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ జోక్యంతో చర్చ తారాస్థాయికి చేరింది. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అధ్యక్షతన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారుల ప్రగతి నివేదికలు, అభివృద్ధిపై సాదాసీదాగా ముగించారు. ఇల్లంతకుంట మండలంలో కొందరు కార్యదర్శులు ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని వచ్చిన ఫిర్యాదుల మేరకు కేవలం మండల పరిధిలో పక్క గ్రామాలకు బదిలీ చేసినట్లు, వాటిని నిలిపివేసి ప్రజాప్రతినిధిగా అవమాన పర్చినట్లు ఎంపీపీ వెంకటరమణారెడ్డి చెప్పారు. ఈ విషయంలో జడ్పీ సీఈవో తీరును ప్రశ్నించారు. మండల పరిషత్‌లో కవ్వంపల్లి సత్యనారాయణ జన్మదినం సందర్భంగా మంత్రి పొన్నం, విప్ ఆది శ్రీనివాస్ ఫ్లెక్సీని ఏర్పాటు చేస్తే వాట్సప్ ఫిర్యాదుతోనే జడ్పీ సీఈవో ఫ్లెక్సీని తొలగింప జేశారని, ప్రజాప్రతినిధులను అవమానపర్చారని అన్నారు. ఎంపీడీవోకు షోకాజ్ నోటీస్ ఇచ్చారన్నారు. వైకుంఠధామాల బిల్లులు ఇంతవరకు రాలేదన్నారు. కార్యదర్శులకు సంబంధించి గతంలో బదిలీ చేసినవి కూడా ఉన్నాయని, ఇప్పుడు మాత్రమే నిబంధనలు ముందుకు తీసుకురావడమేంటని ప్రశ్నించారు. జడ్పీ సీఈవో ఉమారాణి నిబంధనల మేరకు నిర్ణయాలు తీసుకున్నామని ఎన్నికల కోడ్ వచ్చిందని గుర్తు చేశారు. డీపీవో వీరబుచ్చయ్య మాట్లాడుతూ కార్యదర్శుల బదిలీలు గతంలో డీపీవో పరిధిలో ఉండేవని, కొత్త పంచాయతీ రాజ్ చట్టం వచ్చిన తరువాత నిబంధనలు మారిపోయాయని, కలెక్టర్‌కు మాత్రమే కార్యదర్శుల బదిలీలు, చర్యలు తీసుకునే అధికారం ఉందని అన్నారు. ఎవరూ ఆవేశానికి గురికావద్దని, రికార్డులు పరిశీలించాలని జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ సూచనలు చేశారు. సెస్ చైర్మన్ చిక్కాల రామారావు ఒకే అంశంపై చర్చించడంతో సమయం వృథా అవుతుందని సూచించారు. కోనరావుపేట ఎంపీపీ చంద్రయ్య మాట్లాడుతూ మండల పరిషత్‌లో నాయకుల పుట్టిన రోజులు జరుపవచ్చనే నిబంధన ఉంటే తెలపాలన్నారు.

గొర్రెల వాటాధనంపై..

జిల్లాలో సబ్సిడీ గొర్రెల కోసం లబ్ధిదారులు వాటాధనం చెల్లించారని, తిరిగి ఇవ్వడం లేదని సభ్యులు మండిపడ్డారు. డబ్బులు ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. పశు సంవర్ధక శాఖ అధికారి కొమురయ్య మాట్లాడుతూ జిల్లాలోని 717 మంది వాటాధనం డబ్బులు చెల్లించారని, వారికి సంబంధించి 346 మంది లబ్ధిదారుల ఖాతాల్లో శనివారం జమ కాబోతున్నాయని అన్నారు. మిగతా 371 మంది లబ్ధిదారులకు తిరిగి చెల్లించడానికి కలెక్టర్‌కు ఫైల్ పంపామని, వాటిని కూడా వెంటనే అందిస్తామని తెలిపారు.

సమస్యలపై సాదాసీదాగా..

జడ్పీ సర్వసభ్య సమావేశంలో అధికారులు ప్రవేశ పెట్టిన నివేదికలపై సభ్యులు సాదాసీదాగా చర్చించారు. ప్రగతి నివేదికలపై సభ్యులు స్పందించకపోవడం గమనార్హం. కొందరు సభ్యులు మాత్రమే కొన్ని విషయాలపై స్పందించారు. తంగళ్లపల్లి ఎంపీపీ పడిగెల మానస మాట్లా డుతూ తంగళ్లపల్లి మండలం అంకుసాపూర్ పాఠ శాలలో 8వ, 9వ తరగతులు పెంచే విషయమై విద్యార్థుల తల్లిదండ్రుల్లో అయోమయం నెలకొందని, ఈ సంవత్సరం అప్‌గ్రేడ్ అవుతుందా? కాదా? అని ప్రశ్నించారు. విద్యార్థులు ఇతర పాఠ శాలలకు వెళ్లాలా? ఉండాలా? విషయమై సందిగ్ధం నెలకొం దన్నారు. జడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ జిల్లా పరిషత్ నుంచి తీర్మానం చేసి పంపించా మన్నారు. బోయినపల్లి ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్ మాట్లా డుతూ 'అమ్మ ఆదర్శ పాఠశాలల' పనులపై ప్రజాప్రతినిధులకు సమాచారమివ్వలేదన్నారు. 13 మండలాల్లో అధికారులు సమాచారం ఇవ్వలేదని పనులు జరుగుతున్నా తీరు అట్టర్ ప్లాప్‌గా ఉన్నాయన్నారు. తంగళ్లపల్లి జడ్పీటీసీ పూర్మాణి మంజుల కూడా అధికారులు సమాచారం ఇవ్వడం లేదని ప్రశ్నించారు. జడ్పీ సీఈవో ఉమారాణి ఎన్నికల కోడ్ సమయంలో నిబంధనలు వచ్చాయని కమిటీల విషయాలు, పనులపై సమాచారం ఇవ్వలేకపోయారని అన్నారు. జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు మాట్లాడుతూ ఇల్లంతకుంటకు మంజూరైన 50 పడకల ఆసుపత్రి టెండర్ ప్రక్రియ ఎక్కడ వరకు వచ్చిందని? అడిగారు. బోయినపల్లి ఎంపీపీ వేణుగోపాల్ ఆసుపత్రులకు ఎన్‌క్వాష్ బృందం వచ్చినపుడు ఆసుపత్రి చైర్మన్‌గా ఉన్న తమకే సమాచారం ఇవ్వలేదన్నారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుమన్‌మోహన్‌రావు మాట్లాడుతూ కొత్తగా వచ్చిన వైద్యాధికారులకు ప్రోటోకాల్ పద్ధతులు తెలియక పోవడంతో ఇబ్బంది ఏర్పడిందన్నారు. ఎల్లారెడ్డిపేట జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు రావడం లేదని పెండింగ్‌లో ఉన్నాయని, బిల్లులు ఎప్పుడూ వస్తాయని అడిగారు. సెస్ చైర్మన్ చిక్కాల రామారావు తంగళ్లపల్లి మండలం జిల్లెల నుంచి ముస్తాబాద్ రోడ్డు నిలిచిపోయిందని, హెల్త్ సబ్ సెంటర్ నిర్మాణం ఆగిపోయిందని ప్రశ్నించారు. బోయినపల్లి ఎంపీపీ వేణుగోపాల్ బోయినపల్లి మండల పరిషత్‌కు ఏఈ రావడం లేదని ప్రశ్నించారు. ఇతర రోడ్ల సమస్యలపై ప్రశ్నించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు మార్చుకునే వీలుంటుందా? అన్నారు. జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు మాట్లాడుతూ ఇల్లంతకుంట నుంచి సిద్దిపేట, జిల్లెల్ల నుంచి ఇల్లంతకుంట వరకు మంజూరైన రోడ్ల పరిస్థితి ఏమిటన్నారు. ఆర్‌అండ్‌బీ ఈఈ సమాధానం ఇస్తూ ఇల్లంతకుంట నుంచి సిద్దిపేట వరకు రూ.82 కోట్లు, జిల్లెల్ల సంబంధించి రూ.13 కోట్లకు రోడ్డు రద్దయినట్లు తెలిపారు. సెంట్రల్ నిధులకు సంబంధించి రోడ్డు పనులలో మిషన్ భగీరథ పైపులైన్ తొలగించడం ఇబ్బంది కరంగా మారిందన్నారు. సెంట్రల్ నిధుల్లో కాంట్రాక్టర్ పైపులైన్ తొలగించడానికి అదనంగా చేర్చక పోవడంతో కాంట్రాక్టర్ చేయడం లేదని జడ్పీ చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లారు. ఇల్లంతకుంట ఎంపీపీ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ మిషన్‌భగీరథ నీళ్ల ట్యాంక్‌లో పూర్తిస్థాయిలో నింపకపోవడంతో మోటార్లను విని యోగించుకోవడంతో గ్రామాల్లో మోటార్లు కాలిపోతున్నాయన్నారు. తమ మండలంలో గ్రామ పంచాయతీల్లో నిధులు లేక రూ.1.80 లక్షలు మోటార్ల మరమ్మతుకు ఖర్చయ్యాయని, ఎవరిస్తారని ప్రశ్నించారు. అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతోనే పరిస్థి తులు ఈ ఏర్పడ్డాయన్నారు. మిషన్‌భగీరథ ఈఈ జానకి మాట్లాడుతూ సమస్యలను పరిష్కరి స్తామన్నారు. రుద్రంగి జడ్పీటీసీ గట్ల మీనయ్య మాట్లాడుతూ రుద్రంగి వద్ద కల్వర్టు నిర్మాణం సరిగా లేకపోవడంతో ఇబ్బందులు కలుగుతున్నాయని, పరిశీలించి నిర్మాణం చేయాలని అన్నారు.


సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

సమన్వయంతో ముందుకెళ్లాలి

- జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ



అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. వర్షాకాలం నేపథంలో రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు అందుబాటులో ఉండాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, గ్రామాల్లో పారిశుధ్య పనులు చేయించాలని అన్నారు. అభివృద్ధి పనుల సమాచారాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులకు ఇవ్వాలని ప్రోటోకాల్ పాటించాలని అన్నారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, డీఎఫ్‌వో బాలమణి, జడ్పీ సీఈవో ఉమారాణి, జడ్పీటీసీలు గుండం నర్సయ్య, మ్యాకల రవి, నాగం కమార్, కళావతి, కొమిరిశెట్టి విజయ, ఏశ వాణి, కో ఆప్షన్‌సభ్యుడు అహ్మద్, ఎంపీపీలు వంగ కరుణ, పిల్లి రేణుక, మాలోతు బూల, భైరగోని లావణ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్ తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ

తంగళ్లపల్లి, జూన్ 14: తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ అఖిల్ మహాజన్ శుక్రవారం తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లడుతూ ప్రజా ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని అన్నారు. డయల్ 100 కాల్స్ సమస్యలను పరిష్కరించాలన్నారు. బ్లూకోల్ట్స్, పెట్రోల్ కార్ సిబ్బంది 24 గంటలు గస్తీ నిర్వహించాలన్నారు. ఆయన వెంట ఎస్సై సుధాకర్ ఉన్నారు.

సిరిసిల్ల పాలిస్టర్ వస్త్ర ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడిగా ఆడెపు భాస్కర్


నూతన పాలకవర్గం

సిరిసిల్ల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పాలిస్టర్ వస్త్ర ఉత్పత్తి దారుల సంఘం నూతన పాలకవర్గ ఎన్నికల ప్రక్రియ శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో ముగిసింది. అధ్యక్షుడిగా ఆడెపు భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా అంకాలపు రవి, ఉపాధ్యక్షుడిగా దూడం రమేష్, సహాయ కార్యదర్శిగా బండారి అశోక్, కోశాధికారిగా మండల బాలరాజు ఎన్నికయ్యారు.

17న జిల్లా స్థాయి యోగా పోటీలు

సిరిసిల్ల టౌన్, జూన్ 14: ఈ నెల 17న జిల్లా స్థాయి యోగా పోటీలను నిర్వహిస్తున్నట్లు శుక్రవారం జిల్లా యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్, నిర్వాహకులు యాద రమేష్, గద్దె శ్రీదేవి, బొర్ర అశోక్ తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగా జిల్లా అసోసియేషన్, నిత్యయోగ సాధన, ఆది యోగ సాధనాలయాల సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. సిరిసిల్ల పట్టణం శ్రీ చైతన్య స్కూల్(విద్యానగర్)లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు యోగా సాధకుడు సందీప్-7013950299 నంబరులో వాట్సప్ ద్వారా పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ఎల్లారెడ్డిపేట, జూన్ 14:ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లోని సాయిబాబా ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పురోహితులు శివవేదశాస్త్రి, శైలేంద్ర, వీరేంద్ర, శివశాస్త్రి ఆధ్వర్యంలో గణపతి, నవగ్రహ, అభిషేకం, హోమం తదితర కార్యక్రమాలను చేపట్టారు. మహిళలు మంగళహారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పిల్లాపాపలను చల్లంగా చూడాలని వేడుకున్నారు. స్వామివారి చిత్ర పటం ఊరేగించారు. ఆలయ నిర్మాణ కర్త కుమారుడు ఏరె నర్సయ్య, ఎంపీటీసీ అపెరాసుల్తానా, మాజీ సర్పంచులు లక్ష్మీ, నర్సయ్య, నాయకులు గౌస్, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల డే కేర్ సెంటర్ పరిశీలన


పండ్లు పంపిణీ చేస్తున్న ప్రత్యేక అధికారి

ఎల్లారెడ్డిపేట, జూన్ 14: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని వృద్ధుల డే కేర్ సెంటర్‌ను ప్రత్యేక అధికారి, ఎంపీడీవో సత్తయ్య శుక్రవారం సందర్శించారు. కేంద్రంలోని వసతులను పరిశీలించారు. వృద్ధులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. యోగక్షేమాలను పట్టించుకోవాలని కేంద్రం నిర్వాహకులకు సూచించారు. వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం వృద్ధులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ప్రకృతి ఎన్‌జీవో ఆర్గనైజర్ చార్లెస్, మాజీ ఎంపీటీసీ బాలరాజుయాదవ్, నాయకులు సంతోష్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ధరణి సమస్యల పరిష్కారానికి కార్యాచరణ


వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, అధికారులు

సిరిసిల్ల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ ధరణి సమస్యలను ప్రత్యేక కార్యాచరణ ద్వారా పరిష్కరించాలని సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో పెండింగ్ ధరణి సమస్యలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. నవీన్ మిట్టల్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటన కంటే ముందు మార్చి 1 నుంచి మార్చి 15 వరకు ప్రత్యేక డ్రైవ్ ద్వారా 1.38 లక్షల పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించామన్నారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తుల పరిష్కారానికి మరోసారి ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. డేటా కరెక్షన్ దరఖాస్తులు క్షేత్ర స్థాయి విచారణ చేపట్టిన తరువాత పరిష్కరించాలని, మండలాలకు అవసరమైన అదనపు సిబ్బందిని కేటాయించాలని అన్నారు. ధరణి వెబ్‌సైట్‌కు సంబంధించి జీఎల్ఎంటీఎం 33 దరఖాస్తులలో డిజిటల్ సంతకాల ప్రక్రియ మార్పులు చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రతీ మంగళ, శుక్రవారాల్లో నిర్వహిస్తున్న ప్రజావాణిలో వచ్చే భూములకు సంబంధించిన సమస్యలను కలెక్టర్లకు బదిలీ చేయనున్నట్లు చెప్పారు. కలెక్టర్ అనురాగ్ జయంతి, రాజన్న సిరిసిల్ల జిల్లాలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ప్రణాళిక బద్ధంగా పరిష్కరించాలని కమిషనర్ సూచనలను అధికారులకు వివరించారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, ఆర్డీవో రమేష్, తహసీల్దార్ పాల్గొన్నారు.

ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలి


విద్యార్థులతో విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, జూన్ 14: పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు ఆత్మరక్షణ కోసం కరాటేలో ప్రావీణ్యం సంపాదించు కోవాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. కరీంనగర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు శుక్రవారం ఆది శ్రీనివాస్‌ను కలిశారు. ఈ సందర్భంగా మోడల్స్ సాధించిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థి దశ ఎం తో కీలకమన్నారు. ఏకాగ్రతతో సాధన చేస్తే ఆరోగ్యంగా ఉంటారన్నారు. అబ్దుల్‌మన్నాన్, రాజశేఖర్, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

పరిశుభ్రత పాటించాలి


మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

కోనరావుపేట, జూన్ 14 : నులి పురుగుల నివారణకు ప్రతీ ఒక్కరు పరిశుభ్రత పాటించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో రజిత అన్నారు. కోనరావుపేట మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నట్టల నివారణ మందుల పంపిణీపై ఏఎన్ఎం, వైద్య సిబ్బందితో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొదటి సంవత్సరం పిల్లల నుంచి 19 సంవత్సరాల వరకు నులి పురుగుల నివారణకు ఈ నెల 20న మందులు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని వైద్య సిబ్బంది పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పిల్లలు పరిశుభ్రత పాటిస్తే నులిపురుగులను నివారించవచ్చన్నారు. వైద్యాధికారి వేణుమాధవ్, డీహెచ్‌వో బాలచందర్, సూపర్‌వైజర్లు శ్రీదేవి, రషీద్ పాల్గొన్నారు.


వేములవాడ రాజన్న ఆలయం ఎదుట కురుస్తున్న వర్షం

జిల్లాలో భారీ వర్షం

సిరిసిల్ల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఉక్కపోతతో సతమతమవుతున్న జిల్లా ప్రజలకు వర్షం ఉపశమనం కలిగించింది. శుక్రవారం మధ్యాహ్నం. జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. వర్షానికి సిరిసిల్లలో వాతావరణం చల్లబడింది. రోడ్లపై నీరు ప్రవహించింది. జిల్లాలోని ఇల్లంతకుంట, చందుర్తి, వేములవాడ, ఎల్లారెడ్డిపేట, తంగళ్లపల్లి తదితర మండలాల్లో గాలి దుమారంతో వర్షం పడింది. ముస్తాబాద్‌లో విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. చందుర్తి మండలం ఎన్గల్‌లో పిడుగుపాటుకు పకిడె రాజయ్య రైతుకు సంబంధించిన గేదె మృతిచెందింది.

ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రంతోపాటు, గూడూరు, పోతుగల్, గూడెం, నామాపూర్ తదితర గ్రామాల్లో గాలివాన బీభత్సం సృష్టించింది. రోడ్లపై చెట్లు విరిగిపడ్డాయి. గూడూరులో స్తంభం విరిగి విద్యుత్ అంతరాయం కలిగింది. సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి ఆదేశాలతో మరమ్మతు చేపట్టారు.

వేములవాడ టౌన్ : వేములవాడ పట్టణంలో మండలంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. పట్టణంలో ఈదురు గాలులతో కూడిన వర్షం కురువడంతో రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులు తడిసిముద్దయ్యారు. జాత్రగ్రౌండు ఏరియాలో కురిసిన వర్షానికి రోడ్లపైన వర్షపు నిలిచిపోయింది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

య్టైటింక్లయిన్‌కాలనీ, జూన్ 14: ఆత్మహత్యకు యత్నించి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శివరాత్రి సమ్మయ్య(42) గురువారం రాత్రి మృతి చెందాడు. కాలనీ షిర్కే సులబ్ కాంప్లెక్స్ కార్మికుడిగా పనిచేస్తున్న సమ్మయ్య ఆర్థిక ఇబ్బందులను మానసిక క్షోభతో మద్యానికి బానిస అయ్యాడు. ఈక్రమంలో గురువారం తెల్లవారు జామున ఆత్మహత్య చేసుకోవాలని సులబ్ కాంప్లెక్స్ శుభ్రతకు వాడే యాసిడ్‌ను తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108 సాయంతో గోదావరిఖని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందతూ గురువారం రాత్రి సమ్మయ్య మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారైలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హోటల్స్‌లో రెవెన్యూ అధికారుల తనిఖీ

- 14 డొమెస్టిక్ సిలిండర్లు పట్టివేత

ధర్మపురి, జూన్ 14: ధర్మపురి పట్టణంలోని పలు హోటల్స్‌లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు వెంకటేష్, రాజేంద్రప్రసాద్, మల్యాల డీటీసీఎస్ శ్రీనివాస్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హోటల్ యజమానుల వద్ద నుంచి 14 డొమెస్టిక్ సిలిండర్లను పట్టుకున్నారు. అనంతరం డొమెస్టిక్ సిలిండర్లు కలిగి ఉన్న యజమానులపై 6ఏ కేసు నమోదు చేశారు. అనంతరం ఆర్ఐ వెంకటేష్ మాట్లాడుతూ సబ్సిడీపై గృహ అవసరాలకు ఇచ్చే సిలిండర్లను వాణిజ్యపరమైన అవసరాలకు వినియోగించడం నేరమని అన్నారు. వాణిజ్య అవసరాలకు ప్రత్యేకమైన సబ్సిడీ లేని సిలిండర్లను గ్యాస్ ఏజెన్సీల నుంచి తీసుకొని వాడుకోవాలని హోటల్ నిర్వాహకులకు ఆయన సూచించారు.

వేధింపులు భరించలేక యువకుడి ఆత్మహత్య

- సూసైడ్ నోట్ లభ్యం

ఇబ్రహీంపట్నం, జూన్ 14: అప్పు ఇవ్వకుండానే ఇచ్చినట్లు రాయించుకుని నిరంతరం వేధింపులకు పాల్పడటంతో భరించలేక మండల కేంద్రానికి చెందిన సున్నం రవి (42) అనే వ్యక్తి శుక్రవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటనా స్థలంలో రవి జేబులో లభ్యమైన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... ఇబ్రహీంపట్నంకు చెందిన రెబ్బటి రాజేందర్ అనే వ్యక్తి రవికి రెండు లక్షల రూపాయలు అప్పుగా ఇవ్వకుండానే ఇచ్చినట్లు బెదిరించి కొట్టి సంతకం తీసుకున్నాడు. అదే విధంగా గ్రామానికి చెందిన కనక జగన్, చెప్పుల శ్రీనివాస్, గంట గణేష్‌లు రవి వద్ద అప్పులు తీసుకుని చెల్లించడం లేదు. డబ్బులు అడిగినప్పుడల్లా చంపుతామంటూ రవిని బెదిరిస్తూ వస్తున్నారు. ఓ వైపు రవి ఇప్పుగా ఇచ్చిన డబ్బులు రాకపోవడం, మరోవైపు అప్పు తీసుకోకున్నా డబ్బులు చెల్లించాలంటూ రాజేందర్ నుంచి వేధింపులు పెరగడంతో రవి తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు.

ఈ క్రమంలో చేసేది లేక చివరికి సూసైడ్ నోట్ రాసి ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రవి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అనిల్ తెలిపారు. రవికి ఇద్దరు కూతుర్లు, కొడుకు ఉన్నారు. రవి మృతితో గ్రామంలో విషాదం నిండుకుంది. రవి మృతికి కారుకులైన వారి చట్టపరంగా శిక్షించాలని కుటుంబ సభ్యులు, బంధువులు డిమాండ్ చేస్తున్నారు.

కుక్కల దాడిలో ఐదుగురు విద్యార్థులకు తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, జూన్ 14: ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి శుక్రవారం సాయంత్రం ఇంటికి వెళుతున్న ఐదుగురు విద్యార్థులపై రెండు కుక్కలు దాడి చేశాయి. ఈ సంఘటనలో విద్యార్థులు వర్ష, రమేశ్, ప్రవళికతో పాటు మరో ఇద్దరు విద్యార్థులు తీవ్ర గాయాలపాలయ్యారు. అక్కడే ఉన్న వ్యక్తులు అప్రమత్తమై కుక్కలను కర్రలతో వెళ్లగొట్టడంతో పారిపోయాయి. క్షతగాత్రులను స్థానిక ఓ పీఎంపీ వైద్యుడి వద్ద చికిత్స చేయించారు. గ్రామంలో కుక్కల బెడద అధికంగా ఉందని ప్రజలు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శునకాల బారి నుంచి తమతో పాటు పిల్లలను రక్షించాలని తల్లిదండ్రులు కోరారు.

ఆర్టీసీ బస్సు, ద్విచక్రవాహనం ఢీ

- యువకుడి మృతి.. మరొకరికి తీవ్రగాయాలు



అజయ్(ఫైల్)

రుద్రంగి, జూన్ 14: ఆర్టీసీ బస్సు ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందగా మరో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి ఈ సంఘటన రుద్రంగి మండల కేంద్రం శివారులోని కలిగోట తండా మూలమూలుపు వద్ద శుక్రవారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రంగికి చెందిన బిల్లవేణి (గండి) గంగాధర్ - రాయమల్లు దంపతుల కుమారుడు గండి అజయ్(19) ఆనే యువకుడు, ఇదే గ్రామానికి చెందిన బోయిని అభిషేక్ ఆనే యువకుడితో కలిసి కథలాపూర్ మండలానికి ద్విచక్రవాహనంపై వెళ్లారు. తిరిగి రుద్రంగి వస్తున్న సమయంలో రుద్రంగి శివారులోని కలిగోట తండా మూలమూలుపు వద్ద రుద్రంగి నుంచి కోరుట్ల వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు, ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొనడంతో బైక్ నడుపుతున్న బోయిని అభిషేక్‌కు తీవ్రగాయాలయ్యాయి. వెనుకాల కూర్చున్న గండి అజేయ్ ఆనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రగాయాలైన అభిషేక్‌ను చికిత్స కోసం వేములవాడ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ సిరిసిల్ల అశోక్ పరిశీలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు.

● బోనాల పండగ పూట విషాదం..

పెద్దమ్మ బోనాల పండగ పూట ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. పండగ పూట పని నిమిత్తం వెళ్లిన యువకులు తిరిగి వస్తున్న క్రమంలో రుద్రంగి శివారులో మూలమూలుపు వద్ద ఆర్టీసీ బస్సు, ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొనడంతో అజయ్ అక్కడికక్కడే మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పండగ పూట సంతోషంగా ఉండాల్సిన కుటుంబం ఒక్కగానొక్క కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృత్యువాతపడటంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.





ప్రమాదంలో దెబ్బతిన్న బస్సు ముందు భాగం, చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

ఆర్టీసీ బస్సు.. వ్యాన్ ఢీ

- ఐదుగురికి తీవ్రగాయాలు

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలం నేరెళ్ల శివారులో ఆర్టీసీ బస్సు, వ్యాన్ శుక్రవారం ఢీకొనడంతో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. వేములవాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హైదరబాద్ నుంచి సుమారు 20 మంది ప్రయాణికులతో వేములవాడకు వెళ్తుండగా నేరెళ్ల శివారులో ప్రమాదకరమైన మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న డీసీఎం వ్యాన్ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన వ్యాన్ డ్రైవర్ మక్బుల్ (55), సిరిసిల్లకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ ఇంద్రసేనారెడ్డి (46), బస్సులో ప్రయాణికులు కథలాపూర్ మండలం అంబర్‌పేట గ్రామానికి చెందిన వైశాలి (18), గంభీరావుపేటకు చెందిన శశాంక్ (33), వేములవాడకు చెందిన పుల్కం లక్ష్మి తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వారిని 108 వాహనంలో జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మధ్యాహ్నం వర్షం కురుస్తుండగా నేరెళ్ల శివారులోని ప్రమాదకరమైన మూలమలుపు వద్దకు సుమారు 20 మంది ప్రయాణికులతో బస్సు చేరుకోగానే అతివేగంగా ఎదురుగా వచ్చిన వ్యాన్ ఢీకొట్టడంతో సుమారు యాభై మీటర్ల వరకు బస్సును నెట్టుకుంటూ వెళ్లగా చెట్టును ఢీకొట్టి ఆగిపోయినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. చెట్టును ఢీకొని బస్సు ఆగడంతో పెను ప్రమాదం తప్పిందని లేకుంటే బస్సు బోల్తా పడేదని సత్యనారాయణ అనే ప్రయాణికుడు తెలిపాడు. సంఘటన స్థలానికి డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి చేరుకొని ప్రమాదంపై ఆరా తీశారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు. ఈ సంఘటనపై పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

● తరుచూ ప్రమాదాలు..

సిరిసిల్ల-సిద్దిపేట ప్రధాన రహదారిపై ప్రమాదకరమైన మూలమలుపులు చాలా ఉన్నాయి. మూలమలుపుల్లో తరుచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రమాదకరమైన మూల మలుపులు ప్రయాణికుల పాలిట శాపంగా మారాయి. మూలమలుపుల వద్ద రోడ్డు వెడల్పు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

మావోయిస్టు దంపతుల లొంగుబాటు



లొంగిపోయిన మావోయిస్టు దంపతులకు రివార్డు అందజేస్తున్న సీపీ అభిషేక్ మోహంతి

కరీంనగర్ క్రైం, జూన్ 14 సీపీఐ(ఎంఎల్) మావోయిస్టు పార్టీకి చెందిన ఏరియా కమిటీ సభ్యులు తిక్క సుష్మిత అలియాస్ చైతె, మడకం దూల అలియస్ దూల శుక్రవారం పోలీసులకు లొంగిపోయారు. వీరిద్దరు దంపతులు. ఈ మేరకు వరంగల్ ఇన్‌చార్జి పోలీస్ కమిషనర్, కరీంనగర్ సీపీ అభిషేక్ మొహంతి కరీంనగర్‌లో విలేకరులకు వివరాలు వెల్లడించారు. సెంట్రల్ కమిటీ మెంబర్, తెలంగాణ రాష్ట్ర కమిటీ ఇన్‌చార్జి వద్ద సుష్మిత సెంట్రల్ కమిటీ స్టాఫ్‌గా, దూల ప్రొటక్షన్ టీం మెంబర్‌గా పని చేశాడని సీపీ తెలిపారు. హన్మకొండ జిల్లా హసన్‌పర్తి మండలం సుదంపల్లి గ్రామానికి చెందిన తిక్క సుష్మిత(27) ఇంటర్మీడియేట్ వరకు చదువుకుంది. ఆమె తండ్రి తిక్క సుధాకర్ మావోయిస్టు సానుభూతి పరుడిగా పనిచేశాడు. తండ్రిని చూసి మావోయిస్టు పార్టీకి ఆకర్షితులరాలైన సుష్మిత తన చదువు అనంతరం 2016వ సంవత్సరంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా కొమటిపల్లి గ్రామం అటవీ ప్రాంతంలో బడె చొక్కారావు అలీయాస్ దామోదర్ సమక్షంలో మావోయిస్టు పార్టీలో చేరారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా పర్వ గ్రామానికి చెందిన మడకం దూల ఐదో తరగతి వరకు చదువుకున్నాడు. ఆయన సోదరుడు ఐయేత 2008లో సీపీఐ మావోయిస్టు పార్టీలో చేరాడు. అతడిని చూసి ఆకర్షితుడైన దూల 2015లో ఏరియా కమిటీ మెంబర్ అయిన జోగి ప్రోత్సాహంతో మావోయిస్టు పార్టీలో చేరాడు. మావోయిస్టు పార్టీలో చేస్తున్న సమయంలో సుష్మిత, దూలల మధ్య పరిచయం ఏర్పడి 2020 మార్చి30న వివాహం చేసుకున్నారు. తరువాత వివిధ హోదాల్లో మావోయిస్టు పార్టీలో పని చేశారు. మావోయిస్టు సిద్ధాంతాలపై నమ్మకం కోల్పోయి తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన పునరావాస పథకం గురించి తెలుసుకుని ఆకర్షితులై లొంగిపోయారని సీపీ అభిషేక్ మొహంతి తెలిపారు. ఒక్కొక్కరిపై నాలుగు లక్షల రూపాయల రివార్డు ఉందని చెప్పారు. ఆ మొత్తాన్ని మావోయిస్టు దంపతులకు సీపీ బ్యాంకు డీడీ రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మావోయిస్టులు అజ్ఞాతం వీడి, హింసను వదిలి పెట్టి సమాజంలో కలిసిపోయి అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో కాజీపేట ఏసీపీ పి తిరుమల్, హసన్‌పర్తి సీఐ జె సురేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ అంధుల పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

కరీంనగర్ టౌన్, జూన్ 14: జిల్లా కేంద్రంలోని శాతవాహన యూనివర్సిటీ ఎదుట గల ప్రభుత్వ అంధుల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరానికి గాను 1 నుంచి ఐదో తరగతి వరకు ఇంగ్లీష్ మీడియం, 1 నుంచి పదో తరగతి వరకు తెలుగు మీడియంలో విద్యాబోధన చేయడంతో పాటు ఉచితంగా భోజన వసతి కూడా కల్పిస్తామని చెప్పారు. అలాగే ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో రూపొందించిన కంప్యూటర్, వివిధ కళల్లో కూడా విద్యార్థులకు శిక్షణ అందిస్తామని అన్నారు. ఆరు నుంచి 14 ఏళ్ల వయసు కలిగిన బాలబాలికలు ఈ పాఠశాలలో ప్రవేశం తీసుకోవచ్చని అన్నారు. మెడికల్ బోర్డు జారీ చేసిన సదరం సర్టిఫికెట్‌లో 40 నుంచి 100శాతం అంధత్వం కలిగిన విద్యార్థులకు మాత్రమే అర్హత ఉంటుందని తెలిపారు. కరీంనగర్ జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాలకు చెందిన అంధ విద్యార్థులను తమ పాఠశాలలో చేర్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపాలని ఉపాధ్యాయులు, సర్పంచ్‌లు, గ్రామకార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులను కోరారు. ఇతర వివరాలకు ఫోన్: 9494317315, 9701190124, 7396206959, 944033 8424 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఇల్లందకుంట, జూన్ 14: మండలంలోని బూజూనూర్ గ్రామ శివారులో మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ రాజకుమార్ శుక్రవారం తెలిపారు. జమ్మికుంట మానేరు పరివాహక ప్రాంతం నుంచి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇల్లందకుంట మండలంలోని బూజూనూర్ గ్రామం గుండా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజకుమార్ తెలిపారు.

మట్టి తరలిస్తున్న టిప్పర్ల పట్టివేత

మల్యాల, జూన్ 14: మండలంలోని కొండగట్టు, బల్వంతాపూర్ శివారులో నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు టిప్పర్లను పట్టుకున్నట్లు ఎస్సై అబ్దుల్ రహీం శుక్రవారం తెలిపారు. వాహనాల యజమానులు మురళి, రవీందర్ డ్రైవర్లు కోను మహేష్, శివరాత్రి లక్ష్మణ్‌లపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

గత మంగళవారం కూడా అక్రమంగా మట్టి తరలిస్తున్న అయిదు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేసినప్పటికీ మట్టి అక్రమ రవాణా కొనసాగుతూనే ఉంది.

డ్రైవర్లు ఏకాగ్రతతో బస్సులు నడపాలి

- డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ పురుషోత్తం

భగత్‌నగర్, జూన్ 14: డ్రైవర్లు ఏకాగ్రతతో బస్సులను నడిపించాలని, ఆర్టీసీ డ్రైవర్లకు అనుభవజ్ఞులైన డ్రైవర్లతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ పురుషోత్తం అన్నారు. ప్రతి త్రైమాసికంలో ప్రశంసా పత్రాలు, నగదు పురస్కారాలు అందించడంతో డ్రైవర్లకు ఉత్తేజం కలుగుతుందన్నారు. కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి వినోద్ కుమార్ మాట్లాడుతూ కరీంనగర్ జోన్‌కు ఎంతో చరిత్ర ఉందని, రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉంటుందన్నారు. సిబ్బంది కృషి ఫలితంగానే సాధ్యమవుతుందన్నారు. మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీకి ఎంతో పేరు వచ్చిందన్నారు. కరీంనగర్ జోన్‌కు ప్రతి రోజు 5.05 కోట్లు లక్ష్యం కాగా ప్రతిరోజు 5.14 కోట్లు ఆర్జిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో డీలక్స్ ఆపై సర్వీసులలో ఆదాయాన్ని పెంపొందించుకొనుటకు కృషి చేయాలన్నారు. ప్రతి డ్రైవర్ ఏకాగ్రతతో బస్సులను నడిపించాలన్నారు. సెల్‌ఫోన్ వాడరాదని, ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే బాధ్యత ప్రతి డ్రైవర్‌పై ఉందన్నారు. రీజినల్ మేనేజర్ సుచరిత మా ట్లాడుతూ ఉత్తమ ప్రతి కనబర్చిన డ్రైవర్లు, కండక్టర్లు గ్యారెజీ సిబ్బంది సూపర్‌వైజర్లకు ప్రగతిచక్ర అవార్డులు అందించడం జరుగుతుందన్నారు. అవార్డులు సాధించిన ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. 3వ త్రైమాసికంలో 60 మంది ఉద్యోగులకు అవార్డులు అందుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటి రీజినల్ మేనేజర్ (మెకానికల్) కె సత్యనారాయణ, (ఆపరేషన్స్) ఎస్ భూపతిరెడ్డి, పర్సనల్ ఆఫీసర్ ఎం చంద్రయ్య, అకౌంట్స్ ఆఫీసర్ సిహెచ్ వెంకటేశ్వర్లు, రీజియన్‌లోని అన్ని డిపోల మేనేజర్లు, ట్రాఫిక్, మెకానికల్ సూపర్‌వైజర్లు, సేఫ్టీ వార్డెన్స్ డ్రైవింగ్ ఇన్స్‌పెక్టర్లు, వెల్ఫేర్ బోర్డు కమిటీ సభ్యులు, రీజినల్ మేనేజర్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అవార్డులు అందుకున్న ఉద్యోగులతో ఆర్టీసీ అధికారులు

ఆరేళ్ల చిన్నారిపై అత్యాచారం, హత్య

సుల్తానాబాద్, జూన్ 14: సుల్తానాబాద్ రైస్‌మిల్లుల ప్రాంతంలో ఆరేళ్ల చిన్నారిపై హత్యాచారానికి పాల్పడిన అమానుషమైన ఘటన చోటుచేసుకుంది. సుల్తానాబాద్-కాట్నపల్లి మధ్య రాజీవ్ రహదారిని ఆనుకుని ఉన్న ఓ రైస్‌మిల్లులో పని చేయడానికి కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన చెందిన దంపతులు వారం రోజుల క్రితం వచ్చారు. వారికి ఆరేళ్ల, ఏడాది వయస్సుగల ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. గురువారం రైస్‌మిల్లుకు చెందిన లేబర్ రూముల్లో కరెంట్ పోవడంతో ఉక్కపోత భరించలేక తమ ఇద్దరు చిన్నారులతో సహా గది ముందు భాగంలో నిద్రపోయారు. కొంతసేపటి తర్వాత తమ పెద్ద కూతురు కనిపించకపోవడంతో చిన్నారి తల్లి విషయాన్ని భర్తకు తెలిపింది. అతడు మిల్లులోని తోటి కార్మికులతో కలిసి మిల్లుతోపాటు చుట్టుపక్కల వెతుకుతూ డయల్ 100కు కాల్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. సీసీ కెమెరాలను పరిశీలించగా ఓ వ్యక్తి చిన్నారిని భుజాన వేసుకుని వెళుతున్న దృశ్యాలు కనిపించాయి. అప్పటికే పోలీసులు గాలిస్తుండగా చిన్నారి అపహరణకు గురైన మిల్లును ఆనుకుని ఉన్న మరో మిల్లులో తెల్లవారుజామున దుస్తులు ఉతుకుతూ ఓ కార్మికుడు కనిపించాడు. కార్మికులు, పోలీసులు అతడిని విచారించడంతో నిందితుడని తేలింది. అతడు ఈనెల 6న మిల్లులో పనికి చేరాడని తోటి కార్మికులు తెలిపారు. పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకొని విచారించగా, మిల్లు వెనక వైపు చెట్ల పొదల్లో అత్యాచారం చేసి, హత్య చేసినట్లు తేలిపాడు. చిన్నారి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

● ఘటనా స్థలానికి పోలీస్ ఉన్నతాధికారులు

చిన్నారిపై అత్యాచారం, హత్య చేసిన కేసుకు సంబంధించిన ఘటనా స్థలాన్ని రామగుండం కమిషనరేట్ పరిధిలోని పలువురు ఉన్నతాధికారులు పరిశీలించారు. పెద్దపల్లి డీసీపీ చేతన, ఏసీపీ కృష్ణ, సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ శ్రావణ్‌కుమార్‌తో పాటు పలువురు అధికారులు సుల్తానాబాద్‌కు చేరుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

● నిందితుడి అరెస్టు

చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడి హత్య చేసిన నిందితుడిని అరెస్టు చేసినట్లు రామగుండం పోలీస్ కమిషనరేట్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలోని ఓ రైస్ మిల్లులో బీహార్ రాష్ట్రానికి చెందిన నిందితుడు హమాలీగా పని చేస్తున్నాడని పేర్కొన్నారు. గురువారం రాత్రి కరెంట్ పోవడంతో నేరస్తుడు బయటకు వచ్చి బాలిక, తల్లిదండ్రులు రూమ్ బయట పడుకున్న విషయాన్ని గమనించాడన్నారు. చిన్నారిని అక్కడి నుంచి ఎత్తుకెళ్లి రైస్‌మిల్లు వెనుక ప్రాంతంలో అత్యాచారం చేసి చంపి పారిపోయాడని పేర్కొన్నారు. స్థానికుల సమాచారంతో సుల్తానాబాద్ పోలీసులు పట్టుకున్నారని ప్రకటనలో పేర్కొన్నారు.

మూగ యువతిపై అత్యాచారం

సంఘటనాస్థలిని పరిశీలించిన డీఎస్పీ, సీఐ

గొల్లపల్లి, జూన్ 14: గొల్లపల్లి మండలంలోని ఓగ్రామంలో మూగ యువతి (21)పై అత్యాచారం జరగగా, సంఘటనా స్థలాన్ని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సై చిర్ర సతీష్ కుమార్ పరిశీలించి నిందితుడిపై శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన వికలాంగురాలైన యువతిని తీసుకుని శ్రీనివాస్ అనే యువకుడు పనుల నిమిత్తం గొల్లపల్లి మండల కేంద్రానికి తన ద్విచక్రవాహనంపై తీసుకెళ్లి తిరిగి వస్తున్నారు.

ఈ క్రమంలో గోవిందుపల్లె రెవెన్యూ శివారులోని ఓ మామిడితోటలోకి యువతిని బలవంతంగా తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. దీంతో బాధిత యువతి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గాలివాన బీభత్సం

- విరిగిన చెట్లు - లేచిపోయిన రేకుల షెడ్లు



జగిత్యాల-ధర్మారం ప్రధాన రహదారిపైకి వంగిన చెట్టు

గొల్లపల్లి, జూన్ 14: గొల్లపల్లి మండలంలో భారీ ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన గాలివాన శుక్రవారం బీభత్సంను సృష్టించింది. సుమారు గంటపాటు ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. పలు గ్రామాల్లో ఈదురుగాలుల తాకిడికి చెట్లు నేలకు విరిగిపడగా, పలువురు నిరుపేదలకు చెందిన రేకుల షెడ్లు కొట్టుకుపోయి నిరాశ్రయిలయ్యారు. పలుచోట్ల చెట్లు రోడ్డు విరిగిపడ్డంతో వాహనాల రాకపోకలకు అంతరాయమేర్పడింది. మరికొన్ని చోట్ల రోడ్ల పై చెట్టు విరిగిపడ్డంతో వాహనాదారులకు ప్రమాదభరితంగా మారాయి. భారీ వర్షానికి పలుచోట్ల రోడ్లు జలమయం కాగా, డ్రైనేజీలు పొంగిపోర్లాయి. ఉరుములు, మెరుపులతో కూడిన గాలివానకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇదిలా ఉండగా, మండలంలో తొలకరి పలకరింపుతో రైతన్నల మోము పులకరించింది. వేసవి కాలం భానుడి భగభగలతో, తీవ్ర ఉక్కపోతతో సతమైన జనం ఒక్కసారిగా కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడడంతో జనాలకు ఉపశమనం లభించినట్లయింది.

చందుర్తి: చందుర్తి మండలం ఎనగల్, మరిగడ్డ, నర్సింగాపూర్, మూడపల్లి గ్రామాల్లో గాలివాన బీభత్సం సృష్టించింది. ఎనగల్, మూడపల్లిలో భారీ వర్షం కురిసింది. గాలివానకు పలు చోట్ల రోడ్డుపై చెట్లు విరిగిపడ్డాయి.

పిడుగుపాటుకు గేదె మృతి..

మండలంలోని ఎనగల్ గ్రామంలో పాడి రైతు పకిడే రాజయ్యకు చెందిన గేదే పిడుగుపాటుకు మృతి చెందింది. ఎల్లమ్మ ఆలయ సమీపంలోని చెట్టు వద్ద గేదెని కట్టివేయగా పిడుగుపడి అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ దాదాపు రూ. 50 వేల వరకు ఉంటుందని గ్రామస్తులు పేర్కొన్నారు. బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

కొడిమ్యాల: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం రాత్రి, శుక్రవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. బలమైన ఈదురు గాలి వీయటంతో మండలంలోని సండ్రల్లపల్లి గ్రామానికి చెందిన మర్రిపల్లి శంకర్ పశువుల కొట్టం కూలింది, పైకప్పు లేచి పక్కన ఉన్న ఇంటిపై పడింది. దీంతో ఇంటిలోని చిందరవందరగా మారాయి. సుమారు రెండు లక్షల రూపాయల నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

బీర్‌పూర్,జూన్ 14: మండల కేంద్రంలోని రోళ్ల వాగు సమీపంలో శుక్రవారం సగం కాలిన స్థితిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం అయ్యింది. స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి సిబ్బందితో చేరుకున్న జగిత్యాల రూరల్ సీఐ ఆరీఫ్ అలీఖాన్ మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి ఆనవాళ్ల కోసం చుట్టు పక్కల ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం తరలించి కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహం సగానికిపైగా కాలిపోయి ఉండటంతో వ్యక్తి ఎవరు అనేది గుర్తించడం కష్టంగా మారింది. గుర్తుతెలియని వ్యక్తిని హత్య చేసి మృతదేహాన్ని కాల్చి ఉంటారా లేదా ఎవరైనా ఆత్మహత్య కు పాల్పడి ఉంటారా అన్నసందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

వ్యక్తిపై కేసు నమోదు

పాలకుర్తి,జూన్ 14: మండలం పరిధిలోని కన్నాల గ్రామానికి చెందిన పుట్ట రంజిత్‌పై కేసు నమోదైంది. ఇటీవల రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్‌పై, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుపై సోషల్ మీడియాలో రంజిత్ అనుచిత వ్యాఖ్యలు చేశాడని భూతగడ్డల రమేష్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం పుట్ట రంజిత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామి తెలిపారు.

గ్రానైట్ క్వారీ వద్ద వృద్ధుడి అనుమానాస్పద మృతి

● మృతదేహంతో గ్రామస్థుల ఆందోళన
● రూ.6లక్షలు చెల్లించిన క్వారీ యాజమాన్యం

మల్యాల, జూన్ 14: మండలంలోని బల్వంతాపూర్ గ్రామ శివారులో గల గ్రానైట్ క్వారీ వద్ద ఓ వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. మృతుడి తలపై గాయాలు ఉండడంతో మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ గ్రానైట్ క్వారీ వద్ద మృతదేహంతో గ్రామస్థులు ఆందోళన చేశారు. గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బల్వంతాపూర్‌కు చెందిన నెలబొయిన పర్శయ్య(65) గురువారం రాత్రి ఇంట్లో నుంచి బయటకు రాగా అతని మృతదేహం గ్రామశివారులోని మారుతీ గ్రానైట్ క్వారీ వద్ద శుక్రవారం వేకువజామున కొందరు గుర్తించారు. దీంతో అక్కడి సిబ్బంది మృతి విషయాన్ని కుటుంబసభ్యులకు తెలిపారు. అక్కడకు చేరుకున్న కుటుంబసభ్యులు, గ్రామస్థులు వృద్ధుడి మృతిపై అనుమానాలు వ్యక్తం చేశారు. మృతుడి తలపై గాయాలు ఉండడంతో ఓపెన్ బ్లాస్టింగ్‌తో రాళ్లు ఎగిరిపడడంతోనే మృతి చెందాడని బ్లాసింగ్ సమయంలో నిబంధనలు పాటించకపోవడంతో ప్రమాదం చోటు చేసుకుందని గ్రామస్థులు మండిపడ్డారు. మృతదేహాన్ని బట్టి చూస్తే క్వారీలో జరిగిన ప్రమాదమేనని మృతుడి కుటుంబసభ్యులను ఆదుకోవాలని గ్రామస్థులు నక్క అనిల్, రమేష్ డిమాండ్ చేశారు. క్వారీ వద్ద రక్షణ చర్యలు లేకపోవడంతోనే ప్రమాదం జరిగిందని, రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మృతదేహంతో దాదాపు మూడు గంటల పాటు ఆందోళన చేశారు. మల్యాల సీఐ నీలం రవి, ఎస్సైలు అబ్దుల్ రహీం, కుమారస్వామి అక్క డకు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. గ్రామస్థుల ఆందోళన నేపథ్యంలో క్వారీ యాజమాన్యం మృతుడి కుటుంబసభ్యులకు ఆరు లక్షల రూపాయలు చెల్లించ డంతో ఆందోళన విరమించినట్లు గ్రామస్థులు తెలిపారు. పర్శయ్య కొడుకు నరేష్ తన తండ్రికి కొన్నాళ్లుగా మతిస్థిమితం సరిగా లేదని అందులో భాగంగానే గురు వారం అర్ధరాత్రి ఇంట్లో నుంచి వెళ్లగా క్వారీ వద్ద తలపై బండ పడడంతో గాయా లై మృతి చెందాడని తమకు ఎలాంటి అనుమానాలు లేవని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీంతో కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పోలీసులు జగిత్యాలకు తరలించారు.



ఆందోళన చేస్తున్న గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ

మోదీ ప్రభుత్వంలో నేరారోపణలు ఉన్న మంత్రులు ఉండడం దారుణం

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

చిగురుమామిడి, జూన్ 14: ప్రదానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వంలో ఇటీవల నియమించిన కేంద్ర మంత్రుల్లో నేరారోపణలు ఉన్న వారు ఉండడం దారుణమ ని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ముస్కు రాజిరెడ్డి స్మారక భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. ఇటీవల దేశంలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఎక్కువ శాతం మంది అనేక అత్యాచారాలు, ఆర్థిక నేరాలకు పాల్పడిన వారు, ఇతర క్రిమినల్ కేసుల్లో 259 మంది నేరారోపణలు ఉన్నవారు ఎన్నికల్లో గెలిచారన్నారు. ప్రస్తుతం 18 మంది కేంద్ర మంత్రులు కూడా నేరాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. దేశంలో మోదీ సొంత పాలన చేస్తూ 750 మంది రైతులను బలి తీసుకున్నారని ఆరోపించారు. అనేక ఉద్యమాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టలను నాలుగు లేబర్ కోడ్‌లుగా విభజించి కార్మికుల హక్కులను కాలరాసిన నియంత మోదీ అని ఆన్నారు. ఇప్పటికైనా రాజ్యాంగ ప్రకారం దేశ ప్రజలకు పాలన అందించి అన్ని వర్గాల ప్రజలకు సమాన హక్కులను అందించాలని డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నిర్వహించిన విధంగా ప్రజాదర్బార్ నిర్వహించి ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంతరెడ్డి ప్రజల మన్ననలను పొందేలా కృషి చేయాలని ఆన్నారు. ప్రజాదార్బర్ ద్వారా ప్రజలతో, పాటు నాయకులను కలిసి అనేక ప్రజా సమస్యలను తెలుసుకునే అవకాశం ఉంటుందని ఆన్నారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, గూడెం లక్ష్మి, ముద్రకోల రాజయ్య, తెరాల సత్యనారాయణ, బూడిద సదాశివ, కంది రవీందర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇక 'విద్యుత్ ప్రజావాణి'

- ఎన్పీడీసీఎల్‌లో ప్రతీ సోమవారం నిర్వహణ

హనుమకొండ టౌన్, జూన్14: విద్యుత్ వినియోగదారులకు చేరువయ్యే కార్యక్రమంలో భాగంగా వారి ఫిర్యాదులు తీసుకొని సకాలంలో పరిష్కరించేందుకు ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్లలో ప్రతీ సోమవారం 'విద్యుత్ ప్రజావాణి' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. ప్రతీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు 16 సర్కిళ్ల పరిధిలోని డివిజనల్ ఆఫీస్, సబ్‌డివిజనల్ ఆఫీస్, ఈఆర్వో సెక్షన్ ఆఫీస్‌లలో, అదే రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సర్కిల్ ఆఫీస్‌లలో విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. వినియోగదారులు చేసే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించేలా చూస్తామన్నారు. టీజీ ఎన్పీడీసీఎల్‌లోని పోర్టల్‌ను కన్జ్యూమర్ రిసెప్షన్ డెస్క్‌ల కు అనుసంధానం చేసి విద్యుత్ ప్రజావాణి అనే మరొక పోర్టల్‌ను ఏర్పాటు చేసి వినియోగదారులకు మరింత చేరువ చేస్తున్నామని సీఎండీ వెల్లడించారు.

బేగంపేట్‌లో టాస్క్‌ఫోర్స్ దాడులు

రామగిరి, జూన్ 14: మండలంలోని బేగంపేట్ గ్రామంలో గుడుంబా స్థావరాల పై శుక్రవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేపట్టారు. రామగుండం సిపి ఆదేశాల మేరకు గ్రామ శివారులోని కంచల చెరువు సమీపంలో రహస్యంగా నిర్వహిస్తున్న గుడంబా స్థావరాలను గుర్తించారు. స్థావరాల్లోని వెయ్యి లీటర్లబెల్లం పానకం, సామాగ్రిని ధ్వంసం చేశారు. సీఐ రమేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన దాడులు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.7,250 పలికిన పత్తి ధర

జమ్మికుంట, జూన్ 14: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7250 పలికింది. శుక్రవారం మార్కెట్ యార్డుకు 12మంది రైతులు 130క్వింటాళ్ల విడి పత్తి, ముగ్గురు రైతులు రెండు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7250, కనిష్ఠ ధర రూ.6500 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. 15,16న సాధారణ సెలవు ధినాలు కాగా, 17న భక్రీద్, 18న ఉర్సు ఉత్సవాల జాతర సందర్భంగా మార్కెట్ యార్డుకు సెలవు ప్రకటించడం జరిగిందని, తిరిగి బుధవారం కొనుగోళ్లు ప్రారంభం అవుతాయని తెలిపారు.

బియ్యంలో కోటిలింగాలు

- కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై భక్తుల ఆగ్రహం
- అధికారులు పట్టించుకోవాలని విజ్ఞప్తి



బియ్యంలో మునిగిన కోటిలింగాలు

వేములవాడ టౌన్, జూన్ 14: వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలోని కోటిలింగాలు బియ్యంలో కూరుకుపోయి కనిపిస్తున్నాయి. ఆలయంలోని దక్షిణం వైపు ధర్మదర్శనం క్యూలైన్ పక్కనే కోటిలింగాలను ఏర్పాటు చేశారు. రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులు బియ్యాన్ని అంక్షింతలుగా లింగాలు, విగ్రహాలపైన జల్లుతూ మొక్కులు చెల్లించుకుంటారు. విగ్రహాల మీద జల్లే బియ్యాన్ని ఎప్పటికప్పుడు శుభ్రం చేసేందుకు బియ్యం సేకరణకు టెండర్ నిర్వహించారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ బియ్యాన్ని ఎప్పటికప్పుడు తొలగించాలి. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడం, సబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పూజకు నోచుకోని వైనం

● రాజన్న ఆలయంలోని దక్షిణంవైపు ధర్మదర్శం క్యూలైన్ పక్కనే కోటిలింగాలను ఏర్పాటు చేశారు. కొంత కాలంగా ఆ విగ్రహాలకు పూజలు కూడా చేయడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. భక్తితో రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు కోటిలింగాలు పూజకు నోచుకోకుండా కనిపించడంతో ఆలయాధికారుల తీరుపై పెదవి విరుస్తున్నారు. కోటిలింగాలను శుభ్రపరిచి పూజలు చేయాలని కోరుతున్నారు.

కట్టు కాలువ కబ్జాకు యత్నం

- అనుమతుల పేరిట కాలువలో నిర్మాణాలు
- పట్టించుకోని అధికారులు
- లోతట్టు ప్రాంతవాసుల ఆగ్రహం



కాలువలో చేపట్టిన సిమెంట్ కట్టడం

వేములవాడ టౌన్, జూన్ 14: వర్షకాలం వస్తే వేములవాడ పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. రాత్రికిరాత్రే ఇళ్లలోకి నీరు వచ్చి చేరడంతో దిక్కుతోచని స్థితిలో బాధితులు తెల్లవార్లు మెలకువతో ఉండాల్సి వస్తోంది. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజల ఇళ్లలోకి వరద నీరు రాకుండా శాశ్వత పరిష్కారం చూపాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో కాలువలు కబ్జాకు గురవుతున్నాయి. 10 మీటర్లు ఉండాల్సిన కాలువలు 3 మీటర్లకు, 20 మీటర్లు ఉన్న కాలువలు వెలడుల్పు 5 మీటర్లకు కుదించబడుతున్నాయని లోతట్టు ప్రాంత వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపైన అధికారులు సంబంధం లేనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలకు దారితీస్తుంది. వేములవాడ మున్సిపల్ పరిధిలోని కొనాయపల్లి గ్రామ చెరువు నిండి వచ్చే మత్తటి నీరు, మల్లారం కట్టుకాలువ నుంచి వచ్చే నీరు వేములవాడ ఎస్ఆర్ఆర్ ఫంక్షన్‌హాల్ ఎదురుగా ఉన్న కల్వర్టు వద్ద కలిసి మూలవాగులోకి ప్రవహిస్తుంది. మూలవాగులోకి వెళ్లే వరద కాలువ రెండో బైపాస్‌కు దగ్గరగా ఉండడంతో భూముల రేట్లకు రెక్కలు వచ్చాయి. కాలువకు ఇరువైపుల ఉన్న కొందరు రియల్టర్లు కాలువను కబ్జా చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వర్షాకాలంలో వరద ఉధృతి ఎక్కువవడంతో కాలువ వెడల్పు తగ్గి మల్లారం రోడ్డులోని కాలనీ, కొనాయపల్లి శివారులోని లోతట్టు ప్రాంతాలకు చేరుతోంది. ఇళ్లలో నుంచి రాలేని పరిస్థితి నెలకొంటోంది. మూలవాగులోకి వెళ్లే కాలువను ఆనుకొని ఇరిగేషన్ అధికారుల నుంచి పర్మిషన్ పొందినట్లు చెబుతూ ఏకంగా వరద ప్రవాహానికి తట్టుకునేలా కాలువకు సిమెంట్, రాయితో నిర్మిస్తున్నారు. పది మీటర్ల వెడల్పు కాలువలకు బఫర్‌జోన్‌లో బాగంగా 9 మీటర్ల స్థలం విడిచిపెట్టాలి. పది మీటర్ల లోపు కాలువకు రెండు మీటర్ల బఫర్‌జోన్ స్థలం విడిచిపెట్టాలి. అయితే ఎన్ని మీటర్ల వెడల్పు కాలువని లేకముందే అధికారుల కనుసనుల్లోనే నిర్మాణాలు చేపడుతున్నట్లు స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు.

ప్రహరీ నిర్మాణానికి పనులు

వేములవాడ మండల, పట్టణ ప్రాంత శివారుల నుంచి వచ్చే వరద నీరు అడ్డు లేకుండా మూలవాగులో కలుస్తుండేది. మల్లారం రోడ్డులోని ఎస్ఆర్ఎస్ ఫంక్షన్‌హాల్ వద్ద ఉన్న కల్వర్టు నుంచి మూలవాగు వరకు అడుగడుగునా కాలువను కుదిస్తూ వస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. దీంతో సంబంధిత అధికారుల అనుమతి పేరుతో ఏకంగా ప్రహరీ నిర్మాణం చేపడుతున్నారు. కాలువను అనుకొని ఉన్న ఐదు గుంటల స్థలానికి మాత్రమే మున్సిపల్ అధికారులు అనుమతులు ఇస్తారు. ఐదు గుంటలకు ఎక్కువగా ఉన్న స్థలానికి రీజనల్ డైరెక్టర్ ద్వారా అనుమతులు పొందాలి. పలువురు అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత రైతులు మాత్రం తమ పట్టా భూముల నుంచి కాలువ పోతోందని, మా భూమిలో మేం నిర్మాణాలు చేపడుతున్నామని పేర్కొంటున్నారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాల్సి ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

కాలువ కొలతలు తెలియదు

వేములవాడ పట్టణంలోని మల్లారం రోడ్డులో కల్వర్టు నుంచి మూలవాగులో కలిసే కాలువ వెడల్పు వివరాలపై ఇరిగేషన్ అధికారులను కోరగా తమకు పూర్తిగా తెలియదని బదులిచ్చారు. కాలువ సర్వేకు సంబంధిత తహసీల్దార్, ఆర్డీవో, సర్వేయర్‌కు పలుమార్లు దరఖాస్తు చేసినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. పంట భూములు కోతకు గురవుతున్నాయనే పేరుతో ఇద్దరు దరఖాస్తు చేసుకోగా ఇద్దరికి నిబంధనలకు లోబడి అనుమతి ఇచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు వచ్చి హద్దులు ఏర్పాటు చేస్తే తప్పా తాము చేసేది ఏమీ లేదని, చెక్‌డ్యాం నిర్మాణ పనుల్లో బిజీగా ఉండడంతో కాలువపై దృష్టి సారించలేదని ఇరిగేషన్ డీఈ శ్రీనివాస్ వివరణ ఇచ్చారు.



కాలువ పక్కన బఫర్ జోన్ ఏర్పాటు చేయక ముందే నిర్మాణం

48 సార్లు రక్తదానం.. యువకుడికి సన్మానం



జ్ఞాపిక అందుకుంటున్న గిరిధర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట, జూన్ 14: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో 48 సార్లు రక్తదానం చేసిన ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన యువకుడు వంగ గిరిధర్‌రెడ్డిని శుక్రవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ సమీకృత భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో సన్మానించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్, మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రధాన కార్యదర్శి క్రిస్టియనా, విద్యా శాఖ కార్యదర్శి వెంకటేశం జ్ఞాపిక అందజేశారు. నారాయణఖేడ్ ఎంపీ సురేశ్ షట్కర్, మానకొండూరు ఎమ్మెల్యే సత్యనారాయణ, రెడ్ క్రాస్ సొసైటీ ఎంసీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు వేణు పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే కేసులు

ఎల్లారెడ్డిపేట, జూన్ 14: మైనర్లు వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ రమాకాంత్ హెచ్చరించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు గొల్లపల్లిలో శుక్రవారం వాహన తనిఖీలు నిర్వహించారు. అనంతరం గ్రామస్థులకు అవగాహన కల్పించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదన్నారు. మైనర్లు నడుపుతున్న ఏడు వాహనాలను సీజ్ చేశామని ఎస్సై తెలిపారు.

విద్యార్థినికి అభినందనలు

గంభీరావుపేట, జూన్ 14:గంభీరావుపేట మండలం దమ్మన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదోతరగతి చదువుతున్న శ్రీచైత్ర డిసెంబర్ 2023లో నిర్వహించిన (ఎన్ఎంఎంఎస్) నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైంది. ఈ సందర్భంగా గ్రామస్థులు శుక్రవారం శ్రీ చైత్రను అభినందించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు బొయన్నగారి నారాయణ, సంపత్, రాజు, శ్రీధర్ తదితరులు ఉన్నారు.

అంకితభావంతో పని చేయాలి

ఇల్లంతకుంట, జూన్ 14 : విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేయాలని ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి అన్నారు. ఎమ్మార్సీ భవనంలో మెసేంజర్‌గా పనిచేస్తున్న నర్సయ్య పదవీవిరమణ పొందారు. శుక్రవారం మండలపరిషత్ కార్యాలయంలో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించని గ్రామ సభ ఎందుకు?

ఎల్లారెడ్డిపేట, జూన్ 14: సమస్యలతో తాము ఇబ్బందులు పడుతున్నా పరిష్కరించని గ్రామ సభ నిర్వహించడం ఎందుకని ప్రజలు అధికారులను నిలదీశారు. ఎల్లారెడ్డిపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం అధికారులు గ్రామ సభను నిర్వహించారు. ముదస్తుగా దండోర వేయించకుంటే ప్రజలకు ఎలా తెలుస్తోందని ప్రశ్నించారు. వార్డుల్లో మురుగునీటి కాల్వలు కంపుకొడుతున్నా శుభ్రం చేయడం లేదని మండి పడ్డారు. రేషన్ దుకాణాల్లో బియ్యం తక్కువ తూకం వేస్తున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. స్పందించిన ప్రత్యేక అధికారి, ఎంపీడీవో సత్తయ్య సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శి దేవరాజు, ఎంపీటీసీ నాగరాణి, మాజీ ఎంపీటీసీ బాలరాజుయాదవ్, నాయకులు లక్ష్మీనారాయణ, సందీప్, సంతోష్‌గౌడ్ పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

ముస్తాబాద్, జూన్ 14: ముస్తాబాద్ మండల కేంద్రంలో స్పీడ్ బ్రేకర్‌లను ఏర్పాటు చేయాలని పట్టణ వాసులు కోరారు. ముస్తాబాద్ మేజర్ గ్రామ పంచాయతీ ఆవరణలో శుక్రవారం గ్రామ సభను ప్రత్యేకాధికారి సురేశ్ అధ్యక్షతన గ్రామసభను నిర్వహించారు. ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో స్పీడ్ బ్రేకర్‌లను ఏర్పాటు చేయాలన్నారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి వాటర్ ప్లాంటును గ్రామపంచాయితీలోకి తరలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మరమగ్గాల కార్మికులపై కక్ష సాధింపు ధోరణి వీడాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నేత కార్మికులు

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 14: మరమగ్గాల కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణి వీడాలని, సంక్షోభంలో ఉన్న సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను ఆదుకోవాలని సీఐటీయూ తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరమగ్గాల కార్మికులకు రావాల్సిన 10 శాతం యారన్ సబ్సిడీ తగ్గించకుండా విడుదల చేయాలని, కార్మికులకు ఉపాధి కల్పించాలని అన్నారు. ఎన్నికలకు ముందే కార్మికులకు సబ్సిడీ డబ్బులను అందిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిందని రూ.18 కోట్ల నిధులు కూడా విడుదల చేసిందని తెలిపారు. జౌళి శాఖ కమిషనర్ సబ్సిడీ కార్మికులకు అందించడంలో నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందన్నారు. కార్మికులకు గతంలో మాదిరిగానే సబ్సిడీని అందించకుండా తగ్గించి ఇస్తోందని అన్నారు. చేనేత జౌళి శాఖ కమిషనర్ తీసుకుంటున్న నిర్ణయాలతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో పూర్తిగా సంక్షోభం నెలకొని కనుమరుగయ్యే పరిస్థితి కనిపిస్తోందన్నారు. రాజకీయ కక్ష సాధింపుల్లో నేతన్నలు బలవుతున్నారన్నారు. కరెంట్ సబ్సిడీ తొలగించడంతో పరిశ్రమలు మూతపడ్డాయని, అందులో పనిచేసే కార్మికులు రోడ్డున పడ్డారని అన్నారు. వ్యాపారం లేక ఆసాములకు యజమానులు పనులు ఇవ్వలేక పోతున్నారన్నారు. బతుకమ్మ చీరల ఆర్డర్లను రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేయడం, బకాయిలను విడుదల చేయకపోవడం, నాలుగు రకాల ఇబ్బందులు వస్త్ర పరిశ్రమకు చుట్టుముట్టడం, ప్రభుత్వం సహకారం అందించకపోవడం, ఉన్న పథకాలను తొలగించడం వంటి పరిణామాలతో మరమగ్గాలను అమ్ముకొని వలసలు పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, కార్మికులకు, ఆసాములకు ఉపాధిని కల్పించాలని, సంక్షేమ పథకాలను కొనసాగించాలని కోరారు. అంతకుముందు కలెక్టరేట్ ఏవో రామిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, నాయకులు నక్క దేవదాస్, గుండు రమేష్, సిరిమల్ల సత్యం, అన్నల్‌దాస్ గణేష్, సబ్బని చంద్రకాంత్, కంది మల్లేశం, బెజుగం సురేష్, మూషం శంకర్, సందుపట్ల పోచమల్లు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అశోక్‌కు బాల సాహిత్య పురస్కారం



పురస్కారం అందుకుంటున్న గరిపెల్లి అశోక్

సిరిసిల్ల రూరల్, జూన్ 14: కవి, బాల సాహితీవేత్త బాలల కోసం వందలాది కార్యశాలలను నిర్వహించిన బాల సాహిత్య వికాసకారుడు గరిపెల్లి అశోక్‌కు నాలుగు దశాబ్దాల సాహిత్య సేవ, సృజనకు గౌరవంగా బాలా సాహిత్య పురస్కారం లభించింది. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో గురువారం రాత్రి అమరవాది ఫౌండేషన్ హైదరాబాద్ అందిస్తున్న తొలి డాక్టర్ ఎసీఎంఎల్ ప్రసాద్, హైమావతి బాల సాహిత్య పురస్కారాన్ని అందించి పురస్కారం కింద రూ.5 వేల నగదు ఇచ్చారు. నేషన్ బుక్ ట్రస్ట్ సదరన్ రీజినల్ ఆఫీసర్ డాక్టర్ పత్తిపాకమోహన్, సాహిత్య అకాడమీ కన్వీనర్ డాక్టర్ శ్రీమృణాళిని, మణికొండ వేదకుమార్, చొక్కపు వెంకట రమణ, అమరవాది ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ అమరవాది నీరజఅశోక్, ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ మాల్య, నిర్వహణ కార్యదర్శి డాక్టర్ హారిక చెరుకుమల్లి, చింతకిందికామేశ్వర్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అశోక్‌ను మారసం అధ్యక్షుడు టీవీ నారాయణ, ఎలగొండ రవి, ఆడెపు లక్ష్మణ్, జిందం అశోక్, బూర దేవానందం, గణేష్, వంశీ, అంకారపు రవి, అనిత, శ్రీమతి, సౌమ్య, ధరణి, సుమన, చక్రవర్తి, మార్కండేయులు అభినందించారు.

ఆక్వాహబ్ పేరిట భూములు లాక్కున్న బీఆర్ఎస్ ప్రభుత్వం



మాట్లాడుతున్న గుంటి వేణు

సిరిసిల్ల టౌన్, జూన్ 14: బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో ఆక్వాహబ్ పేరుతో తంగళ్లపల్లి మండల చీర్లవంచ గ్రామ ప్రజలు, రైతులను భయపెట్టి భూములను బలవంతంగా లాక్కుందని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం సీపీఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చీర్లవంచ గ్రామానికి చెందిన 150 మంది ప్రజలు, రైతుల నుంచి 364 ఎకరాల భూమిని లాక్కుందని, ఆక్వాహబ్ పేరుతో నాలుగు కంపెనీలకు కట్టబెట్టిందని అన్నారు. చీర్లవంచ గ్రామం పూర్తిగా నిర్వాసిత గ్రామమన్నారు. ఆ గ్రామంలో మధ్య మానేరు ప్రాజెక్టు కోసం ఇళ్లు, వ్యవసాయ భూములను రైతులు, గ్రామస్థులు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వాసితులకు పూర్తి స్థాయిలో పరిహారం అందక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఎకరానికి దాదాపు 30 లక్షల విలువ చేసే భూమిని బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం ఎకరానికి రూ.7 లక్షలకే బలవంతగా కొనుగోలు చేసిందని ఆరోపించారు. ఆ కంపనీలు ఆక్వాహబ్ పెట్టకుండనే మరో కంపెనీలకు విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. చీర్లవంచ రైతులు, ప్రజల నుంచి తీసుకున్న 364 ఎకరాల భూమిని తిరిగి వారికే ఇవ్వాలని, లేని పక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమ నాగరాజు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాసం



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

సిరిసిల్ల రూరల్, జూన్ 14: సిరిసిల్ల పట్టణంలోని తారకరామనగర్ పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందజేశారు. బడిబాట కార్యక్రమం చేపట్టారు. ప్రధానోపాధ్యాయిని అయిలేని భారతి, ఉపాధ్యాయులు లక్ష్మీ, రాణి, జ్యోతి పాల్గొన్నారు.

గంభీరావుపేట:గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం అక్షరాభాస్యం నిర్వహించారు. పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. హెచ్ఎం అజయ్‌కుమార్, ఉన్నత పాఠశాల హెచ్ఎం నర్సింగరావు, ఎంపీటీసీ రాజేందర్ ఉన్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ నాయకులు బద్దం ఎల్లారెడ్డి, అన్నాడి సంపత్‌రెడ్డి విద్యార్థులకు నోట్‌బుక్కులు పంపిణీ చేశారు. పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ ప్రమోద, ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్‌రెడ్డి, రిటైర్డ్ ఎంఈవో బాలనాగాచారి పాల్గొన్నారు.

వీర్నపల్లి: రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో, ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థులకు శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుక, ఎంపీటీసీ అరుణ్ కుమార్, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపధ్యాయుడు తుమ్మ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు బొప్పాపూర్, గొల్లపల్లి, నారాయణపూర్, అల్మాస్‌పూర్ తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే సర్కారు నాణ్యమైన విద్యను అందిస్తోందన్నారు. మండల కేంద్రానికి చెందిన ఎన్ఆర్ఐ రాధారపు సత్యం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పలకలు, బలపాలను సమకూర్చారు. మండల కేంద్రంతోపాటు బొప్పాపూర్‌లోని పాఠశాలల్లో ప్రత్యేక అధికారి, ఎంపీడీవో సత్తయ్య, ఇన్‌చార్జి ఎంఈవో రఘుపతి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. .

కోనరావుపేట: కోనరావుపేట మండలం మరిమడ్ల అంగన్వాడి కేంద్రాల్లో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ గంగలక్ష్మి, ఎంపీటీసీ రేణుక, అంగన్వాడీ టీచర్లు బి.లక్ష్మి, ఎస్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్ : ముస్తాబాద్ మండల కేంద్రంతో పాటు, పలు గ్రామాల్లోని అంగనివాడీ సెంటర్‌లలో సామహిక అక్షరాభ్యసం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ప్రభుత్వ కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో అంగనివాడీ సైపర్ వైజర్ అరవింద తదితరులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిపేటలో అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

రక్తదానం వైపు ప్రజలను చైతన్య పర్చాలి

వేములవాడ టౌన్, జూన్ 14 : రక్తదానం చేసే వైపు ప్రజలను చైతన్య పర్చాలని యువ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గొడిశెల రాజశేఖర్ అన్నారు. వేములవాడ పట్టణంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదానంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. నేత్ర వైద్య నిపుణుడు డాక్టర్ రమణారావు ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ రక్తదానానికి దాతలు అపోహాలు లేకుండా ముందుకు రావాలన్నారు. రక్తదానంతో అనేక ప్రయోజనాలు కలుగుతాయని

బండి సంజయ్‌ని కలిసిన బీజేపీ నేతలు

చందుర్తి, జూన్ 14 : కరీంనగర్ పార్లమెంటు సభ్యుడు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను ఢిల్లీలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్ శుక్రవారం కలిశారు.

రుద్రంగి: నూతనంగా ఎన్నికైన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను శుక్రవారం ఢిల్లీలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకంక్షలు తెలిపారు.

వీర్నపల్లిలో దంత వైద్య శిబిరం

వీర్నపల్లి, మే 14: మారుమూల అటవీ ప్రాంతమైన వీర్నపల్లి మండల ంలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో దంత వైద్యుడు శ్రీనివాస్ శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. అటవీ గ్రామాల్లో ప్రభుత్వ వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఎంఎల్‌హెచ్ఈ చైతన్య, సూపర్‌వైజర్ పద్మ, ఏఎన్ఎంలు కీర్తి, సుజాత, ఆశావర్కర్లు ఉన్నారు.

ఇసుక దందాపై పోలీసుల నజర్?

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

ఎల్లారెడ్డిపేట, జూన్ 14: ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్, వెంకటాపూర్, రాగట్లపల్లి, అగ్రహారం, బండలింగంపల్లి, సింగారం, పదిర తదితర గ్రామాల శివారులోని మానేరు వాగు నుంచి అనుమతుల పేరిట అక్రమంగా తరలుతున్న ఇసుక రవాణాపై ప్రత్యేక పోలీసులు శుక్రవారం ఆరా తీశారని తెలిసింది. మండలంలో సాగుతున్న ఇసుక తరలింపుపై శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో 'మానేరు వాగులో ఆగని ఇసుక దందా' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి పోలీసులు, తహసీల్ అధికారులు స్పందించారు. వేకువజామున ఆయా గ్రామాల్లోని మానేరు వాగులోకి చేరుకున్న ఇసుక ట్రాక్టర్లను పట్టుకునేందుకు అధికారులు వస్తున్నారనే ముందస్తు సమాచారంతో రవాణాదారులు వాహనాలను అక్కడి నుంచి తీసుకెళ్లారు. వాహనాలను సీజ్ చేస్తారని గమనించిన వ్యాపారులు ఇసుక రవాణాను ఆపేశారు. మరో వైపు పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించి మైనర్లు నడుపుతున్న ఏడు వాహనాలను సీజ్ చేశారు.

ముచ్చర్లలో బడిబాట

గంభీరావుపేట, జూన్ 14 : గంభీరావుపేట మండలం ముచ్చర్ల గ్రామంలో బడిబాటలో బాగంగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతి విద్యార్థులకు సాముహిక అక్షరబ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మెన్ వంగ శోభ, ఎంపీటీసీ వంగ స్వప్న, పాఠశాల హెచ్ఎం లక్ష్మీనారాయణ, ఉన్నత పాఠశాల ఇంచార్జీ హెచ్ఎం నరేందర్ ఉన్నారు.

స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులకు అభినందనలు

సిరిసిల్ల రూరల్, జూన్ 14: సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 8వ తరగతి విద్యార్థులకు చదువుకోసం అందించే నేషన్ మెయిన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌ల కోసం నిర్వహించిన పోటీ పరీక్షల్లో ముగ్గురు విద్యార్థులు విజేతలుగా నిలవడంతో శుక్రవారం ఆ విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయిని నాగుల భాగ్యరేఖ, ఉపాధ్యాయులు అభినందించారు. ఇందులో ఆడెపు లిఖిత్, మలిపెద్ది లహరి, మామిడిశెట్టి విజేతలుగా నిలిచారు. ఏడాదికి రూ.12 వేల చొప్పున నాలుగు సంవత్సరాలపాటు స్కాలర్‌షిప్ మంజూరవుతుందని ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. ఉపాధ్యాయులు గన్నమనేని శ్రీనివాసరావు, గుత్తికొండ రాజశేఖర్, కోడం భారతి, సలావుద్దీన్, అడుప కీర్తి, ఇప్పకాయల ప్రకాష్, చిమ్మని సువర్ణ, కొలుగూరి రజితలు పాల్గొన్నారు.

విత్తన శుద్ధి చేసుకోవాలి

కోనరావుపేట, జూన్ 14 : రైతులు విత్తన శుద్ధి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారిని వెంకట్రామమ్మ సూచించారు. కోనరావుపేట మండలం పలు గ్రామాలలో శుక్రవారం ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే డీలర్ షిప్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

ఎస్సీ బాలుర వసతి గృహంలో ప్రవేశాల కోసం ప్రచారం

చందుర్తి, జూన్ 14:చందుర్తి మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో ప్రవేశాల కోసం వసతి గృహ సంక్షేమ అధికారి రవీంద్రస్వామి ఆధ్వర్యంలో వసతి గృహ సిబ్బంది గ్రామాల్లో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. వసతి గృహంలో 3వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఉచిత ప్రవేశం ఉంటుందన్నారు. వసతి గృహంలో విద్యార్థులకు భోజన వసతితో పాటు, ఉచిత పాఠ్యపుస్తకాలు తదితర సౌకర్యాల గురించి వివరిస్తూ వసతి గృహంలో ప్రవేశం పొందాలని కోరుతూ గ్రామాల్లో తల్లిదండ్రుల వద్దకు వెళ్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చందుర్తి, జూన్ 14 : వేములవాడ రూరల్ మండలంలోని మల్లారం 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో శనివారం చందుర్తి మండలంలోని పలు గ్రామాల్లో మరమ్మతు పనుల నేపథ్యంల విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు సెస్ ఏఈ మహేష్ శుక్రవారం తెలిపారు. చందుర్తి మండలంలోని మర్రిగడ్డ, తిమ్మాపూర్, సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న మర్రిగడ్డ, తిమ్మాపూర్, మూడపల్లి, అనంతపల్లి, ఆశిరెడ్డిపల్లి, జోగాపూర్, ఎన్గల్, రామన్నపేట, చందుర్తి, నర్సింగాపూర్‌లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగనున్నట్లు తెలిపారు.

నేషనల్ స్కాలర్‌షిప్‌కు విద్యార్థుల ఎంపిక

చందుర్తి, జూన్ 14 : చందుర్తి మండలం మల్యాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు గ్రామస్థులు శుక్రవారం తెలిపారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న యెల్ల చరణ్, గొర్రె దీక్ష ఎంపికవగా అభినందించారు.

విద్యుత్ తీగలు సరిచేయాలి

ఎల్లారెడ్డిపేట, జూన్ 14: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామ శివారులోని వ్యవసాయ పొలాల్లో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలను సరి చేయాలని రైతులు డిమాండ్ చేశారు. శుక్రవారం గ్రామంలో నిరసన తెలిపారు. పలుమార్లు సెస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని మండి పడ్డారు. పొలాల్లో దున్నుతున్న క్రమంలో ట్రాక్టర్లకు తీగలు తగులుతున్నాయన్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించాలన్నారు.